ప్రజాశక్తి
శుక్రవారం 21 జూన్ 2024

సబ్జెక్ట్ టీచర్ల ప్రమోషన్లలో జాప్యం

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు ముఖ్యంగా బయాలజీ, ఇంగ్లీష్ టీచర్ల ప్రమోషన్లలో తీవ్ర కాలయాపన జరుగుతోందని యుటిఎఫ్ జిల్లా కమిటీ తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేస్తూ, అర్హులైన ఇన్ సర్వీస్ టీచర్లకు ఇవ్వాల్సిన సబ్జెక్టు పోస్టులకు కాలయాపన చేస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. వాళ్లకు రావలసిన 70శాతం ప్రమోషన్ పోస్టులను వేరే వాళ్లకు కట్టబెట్టాలని చూస్తున్నారని, దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఎన్నోసార్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, ఐటిడిఎ చుట్టూ ప్రదక్షిణలు చేసినా కనీస స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు మొండివైఖరి విడనాడి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన 70శాతం ప్రమోషన్ పోస్టులను వారికి ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.

'పిఎం జన్‌మన్'కు మెట్టపాలెం ఎంపిక

- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, సిపిఎం

గ్రామసభలో మాట్లాడుతున్న సిపిఎం నేత గోవింద్

ప్రజాశక్తి - అనంతగిరి : ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జన్‌మన్) పథకం కింద మండలంలోని చిలకగెడ్డ పంచాయతీ మెట్టపాలెం ఆదివాసీ గిరిజన గ్రామాన్ని ఎంపిక చేయడంపై స్థానిక పివిటిజిలు, సిపిఎం నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మెట్టపాలెంలో సర్పంచ్ మజ్జి అప్పారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. జన్‌మన్ కింద మెట్టపాలెన్ని ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో 39కుటుంబాలకు చెందిన 133మంది పివిటిజి గిరిజనులు నివసిస్తున్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు, జన్‌మన్ పథకం కింద వారి సర్వతోముఖాభివృద్ధికి చర్యలు చేపట్టడంతోపాటు గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. ఈ పథకం కింద పిఎం ఆవాస్‌లో గృహనిర్మాణం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన ఆరోగ్యసంరక్షణ, విద్య, పోషకాహారం, రహదారులు, సమాచార వ్యవస్థ వంటి పథకాలను చేరువచేయడం ద్వారా వారి స్థిరమైన జీవనోపాధిని మెరుగుపరిచే చర్యలు చేపట్టనున్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో మెట్టపాలెం గ్రామాన్ని పిఎం జన్‌మన్ కింద ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో తాటిపూడి డ్యాంలో భూములు కోల్పోయిన తాము చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నామని, గ్రామంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గ్రామంలో ఉన్న 33/11 కెవి విద్యుత్ వైర్లు తొలగించాలని. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీలుగురుపాడు నుండి రోడ్డు నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని కోరారు. గ్రామసభలో ఎంపిడిఓ నాగేష్, ఎంఆర్ఐ లక్ష్మణరావు, ఎంపిటిసి టి మిథులు, పలుశాఖల అధికారులు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవింద్ పాల్గొన్నారు.

ఊటనీరే గతి!

- దాబుగూడలో తాగునీటికి కటకట
- నిర్వహణలేమితో పాడైన జలధార గ్రావిటీ పథకం
- కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డ నీరే దిక్కు
- కలుషిత నీటితో గిరిజనం అస్వస్థత, అవస్థలు
- పట్టించుకోని అధికారులు, నేతలు

ఊట నీరు పడుతున్న గిరిజన మహిళ

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: మండలంలోని దాబుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ప్రభుత్వ పరంగా మంచినీటిబోరుగానీ, బావిగానీ లేకపోగా, ఇన్నాళ్లు గిరిజనం దాహార్తిని తీర్చిన విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎస్ఆర్ నిధులతో శారదా ట్రస్ట్ సహకారంతో నిర్మించిన గ్రావిటీ పథకం మూలకు చేరింది. దీంతో గత్యంతరం లేక గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డ నుంచి కలుషిత నీటిని తెచ్చుకుని రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని మాదల పంచాయతీ మారుమూల పివిటిజి గ్రామమైన దాబుగూడ గ్రామ గిరిజనం దాహార్తితో అల్లాడి పోతున్నారు. గ్రామంలో సుమారు 50 ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఉండగా, వారికి ప్రభుత్వపరంగా నేటివరకు సరైన రక్షితనీటి సదుపాయం లేదు. గతంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎస్ఆర్ నిధులతో, శారద ట్రస్టు సహకారంతో జలధార గ్రావిటీ పథకం నిర్మించారు. కొండపైనుంచి పైపులైను ద్వారా నీటిని గ్రావిటీ విధానంలో మళ్లించి, ట్యాంకర్‌లో నిల్వ ఉంచి కుళాయిల ద్వారా గ్రామస్తుల నీటి అవసరాలను తీర్చేవారు. అయితే ఈ పథకం కాస్తా మరమ్మతుకు గురికావడంతో ఇపుడు నీటికి కటకట తప్పడం లేదు. మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో గ్రామానికి దూరాన ఉన్న ఊటగెడ్డకు వెళ్లి, అక్కడే కాలకృత్యాలు, ఇతర అవసరాలను తీర్చుకుని, తలపై బిందెతో నీటిని తెచ్చుకుని, వంట, తాగునీరు ఇతర అవసరాలను తీర్చుకుంటు న్నామని వాపోతున్నారు. ఎండాకాలంలో ఊటగెడ్డ ఎండిపోగా, వర్షాకాలంలో బురదనీరు.. ఇలా ఏ సీజన్‌లోనైనా కలుషిత నీరు గెడ్డలో ఉంటుందని, అయినా గత్యంతరం లేక అదేనీటిని వాడుతున్నామని దాబుగుడ వాసులు అంటున్నారు. మరోవైపు గ్రామానికి దూరంగా గెడ్డ ఉండడంతో ఒకరిద్దరు వెళ్లలేని పరిస్థితి ఉందని, నలుగురైదుగురు గుంపులుగా ఉదయం సాయంత్రం వేళల్లో గెడ్డకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని దాబుగుడ మహిళలు అంటున్నారు..ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని దాబుగుడ వాసులు మొరపెట్టుకుంటున్నారు.

నిరుపయోగంగా ఉన్న జలధార తాగునీటి పథకం

గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు, హాజరైన చొప్పల్లి గ్రామ నిర్వాసితులు

పునరావాసంపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-విఆర్.పురం : పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల పునరావాసానికి సంబంధించి మండలంలోని చొప్పల్లి గ్రామంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. పోలవరం భూసేకరణ అధికారుల అదేశాలు మేరకు మండల తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆధ్వర్యాన చొప్పల్లిలో జరిగిన ఈ అర్ అండ్ ఆర్ గ్రామసభలో ప్రజల అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో 196 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, వారిలో కొందరు ఎటపాక మండలం లింగాలపల్లి, రామగోపాలపురం గ్రామాలలో పునరావాసం కావాలని కోరగా, మరికొందరు గంగవరం మండలం లక్కోండ గ్రామంలో ఆర్ అండ్ ఆర్ కాలనీల కోసం భూములు చూపాలని కోరారు. వీటిపై వారి అంగీకారం మేరకు గ్రామసభలో నిర్థిష్టంగా సంతకాలు తీసుకొని, వారి అభిప్రాయం మేరకు కాలనీలకు స్థలాలు చూపించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామసభలో ఆర్ అండ్ ఆర్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, రామవరం సర్పంచ్, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఆర్ఐ, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండల వ్యవసాయశాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు, టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని డివి.కోట, సున్నంపాడు పంచాయతీల పరిధిలోని సచివాలయాల్లో గురువారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు శేషు కుమార్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం 2024 ఖరీఫ్ సీజన్ మొదలవగానే సబ్సిడీ విత్తనాలు ప్రతి రైతుకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు బి.అప్పాజీ, జనసేన మండల అధ్యక్షులు మళ్ల దుర్గాప్రసాద్, టిడిపి నాయకులు కర్రి సన్యాసిరెడ్డి, కె.సోమరాజు, పోడియం శ్రీనుబాబు, అందాల సూర్యనారాయణ రెడ్డి, కంగాల కన్నపుదొర, పోడియం కన్నపుదొర, కురుసం బాపన్న దొర, కుంజం సత్తిబాబు, కంగాల బుల్లెమ్మ, వార్డ్ మెంబర్ నూకలమ్మ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- ఐటిడిఎ పిఒ అభిషేక్ హెచ్చరిక
- గుంటసీమ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు
- ఉపాధ్యాయ అవతారమెత్తి పాఠాలు చెప్పిన పిఒ

విద్యార్థులకు సోషల్ పాఠం చెబుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేదిల లేదని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ హెచ్చరించారు. గురువారం గుంటసీమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థుల హాజరు పట్టీలనుతనిఖీ చేసారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మొత్తం ఎంత మంది ఉండాలి ? ఎంతమంది హాజరు కాలేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి కోటేశ్వరరావు విధులకు గైర్హాజరవడంతో షోకాజ్ నోటీసు జారీ చేసారు. సికిల్‌సెల్ ఎనిమియా లక్షణాలు ఉన్న విద్యార్థులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తలిదండ్రులు సికిల్‌సెల్ ఎనీయా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. టెన్త్ తర్వాత ఏం చదువుతారని విద్యార్థులను ప్రశ్నించగా, ఎక్కువమంది ఇంటర్ అని చెప్పడంతో ఆ తర్వాత డిగ్రీలో కూడా చేరి బాగా చదువుకోవాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయ అవతారమెత్తి, 9వ తరగతి విద్యార్థులకు జాగ్రఫీ పాఠ్యాంశాలను బోధించారు. పాఠ్యాంశంలోని ప్రశ్నలు వేసి జవాబులు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడి ప్రతి విద్యార్థి పాఠశాలకు హజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతీ విద్యార్థి పాఠశాలలోనే ఉండాలన్నారు. అనంతరం నందివలస బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. 10 వతరగతిలో ఎంత మంది విద్యార్థులున్నారని అడిగి తెలుసుకున్నారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద పెట్టాలని స్పష్టం చేసారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు.. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ కొండలరావు పాల్గొన్నారు.

వికలాంగ బాలలను పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి- పెదబయలు : ఇటీవల సర్వేలో గుర్తించిన 30మంది వికలాంగ బాలలను తక్షణమే పాఠశాలల్లో చేర్పించే చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ కొమ్మ భాస్కరరావు అన్నారు. గురువారం పెదబయలు మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. సర్వేలో గుర్తించిన వికలాంగ బాలల వివరాలపై ఆరాతీసి, వారందరినీ పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రు లకు అవగాహన కల్పించి చేర్పించాలని మండల ఎల్ఇఆర్‌టిలు రవి, చంద్రభవానీలకు సూచించారు. తర్వాత జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించి, ఇంటర్ అడ్మిషన్లపై ఆరా తీశారు. గ్రూపులవారీగా పూర్తిస్థాయిలో విద్యార్థులను చేర్పించే చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక కస్తూర్బా పాఠశాలను సందర్శించారు.

బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచాలి

- వరదల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి బాధితులకు పూర్తిగా న్యాయం జరిగేలా చర్యలు
- సిపిఎం మండల కమిటీ డిమాండ్

సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- విఆర్.పురం

వరదలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు అందుబాటులో బఫర్ స్టాక్ ఉంచాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. వరదల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి, వరద బాధితులకు పూర్తి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు మండలంలోని పెద్దమట్టపల్లిలో తుర్రం బాబురావు అధ్యక్షతన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన ప్రతి ఏటా నిర్వాసితులు మునిగి తేలాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కారు చీకట్లో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వరదల సమయంలో జీవనం సాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకోవటం కోసం ముందుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రూట్ బంద్ అయ్యే గ్రామాలలో బోట్లు, మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రం రేఖపల్లిలో బాధితులకు పునరావాసం కల్పించాలని, తాగునీరు అందించాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వరదల సమయంలో బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకులు, కూరగాయలు తీసుకురావటానికి వీలుగా చింతూరు నుంచి కాన్సులూరు మీదుగా కుండులూరు వరకు రోడ్డు మార్గానికి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు పులి సంతోష్ కుమార్, కుంజ నాగిరెడ్డి, వడ్లాది రమేష్, తోడం రాజు, కదల కొండారెడ్డి, పొడియం శ్రీరామ్మూర్తి, అసు. లక్ష్మయ్య, చిక్కాల రామారావు, కారం సత్తిబాబు, సిరపు తాతబాబు, గుండిపూడి లక్ష్మణ్, కమ్మిచిచ్చు సత్యనారాయణ, సోడి మల్లయ్య, అచ్యుతరావు, కన్నారావు, ఖాదర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్ర ఇంటిపై కూలిన చెట్టు

ఈదురుగాలులకు ఇంటిపై కూలిన చెట్టు

ప్రజాశక్తి -సీలేరు : ఈదురుగాలులు కారణంగా చెట్టు ఇంటిపై కూలిన సంఘటన జికె.వీధి మండలం సీలేరులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. సీలేరులో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. పెద్ద పెద్ద శబ్ధాలతో ఉరుములు ఉరుమడంతో గ్రామంలోని రాజేంద్ర కుటుంబ సభ్యులు ఇంటిలో నుంచి భయాందోళనతో బయటకు వచ్చారు. ఇంతలోనే భారీ ఈదురుగాలలకు ఇంటి సమీపంలో ఉన్న వేప చెట్టు విరిగి రాజేంద్ర ఇంటిపై పడింది. దీంతో రాజేంద్ర కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే చెట్లు కూలిన సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. తాము నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వాళ్లమని, తమను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని రాజేంద్ర కుటుంబ సభ్యులు కోరారు.

అరకులోయలో అరుదైన ఆపరేషన్

మహిళ కడుపులోంచి ఎనిమిది కిలోల కణితి తొలగింపు

ఆపరేషన్ చేసి రోగి పొట్టలోని కణితి తొలగిస్తున్న ఏరియా ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి- అరకులోయ : అరకులో ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. అరకులోయ మండలం సిరగం పంచాయతీ దిబ్బ వలస గ్రామానికి చెందిన సోడేపల్లి థీమో అనే గిరిజన మహిళ ఆరు సంవత్సరాల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుంది. దీంతో అరకులోయ ఏరియా ఆసుపత్రికి సందర్శించగా , ఇక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. బుధవారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.రాము, డాక్టర్ అప్పారావు, డాక్టర్ కృష్ణ, డాక్టర్ పవన్ ఆపరేషన్ చేసి ఆమె కడుపులో నుంచి 8 కిలోల కణితిని తొలగించారు. విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి ఇంత పెద్ద కణితిని తొలగించిన వైద్యులను అరకులోయ ప్రాంతవాసులు అభినందించారు. అరకులోయ ఆసుపత్రిలో ఇటువంటి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించడం ఇదే మొదటిసారి అని స్థానికులు అంటున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అల్లూరి జిల్లా ఐసిడిఎస్ పీడీ ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. మండలంలోని పలు అంగన్వాడి కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని అనంతగిరి, లబ్బర్తి కేంద్రాలను తనిఖీలు నిర్వహించి, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు కేంద్రాల ద్వారా ఏవిధంగా సరుకులు అందుతున్నది ఆరా తీశారు. ప్రీ స్కూల్ ప్రక్రియ క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం కేంద్రాల ద్వారా అందించే ఆహారాన్ని సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి ఆన్‌లైన్ యాప్ వర్కులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలను సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిడి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వేణు, రాజవొమ్మంగి ఇన్‌ఛార్జి సిడిపిఓ అరుణలత, సూపర్వైజర్లు అమ్మిరాజు, అమ్మాజీ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

ఎమ్మెల్యే శిరీషకు ఐసిడిఎస్ పీడీ అభినందనలు

రాజవొమ్మంగి : రంపచోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవికి ఆమె స్వగృహంలో అల్లూరి జిల్లా ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి, రంపచోడవరం నియోజకవర్గం ఐసిడిఎస్ సిబ్బంది గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ సిడిపివోలు సుధ, లక్ష్మి, ప్రసన్న, గౌరీ, నాగలక్ష్మి, రాజవొమ్మంగి ఇన్‌ఛార్జి సిడిపిఓ అరుణలత, సూపర్వైజర్లు అమ్మాజీ, అమ్మిరాజు, రాఘవ, పోతురాజు, ప్రకాష్ కుమారి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		

అరకులోయ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వేతన బకాయి చెల్లించాలని...
ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: పాడేరు, అరకు, ముంచంగిపుట్టు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయిపడ్డ నాలుగు నెలల వేతనాలను చెల్లించాలని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం అరకులోయ ఏరియా ఆసుపత్రిలో పర్యటించి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. అతి తక్కువ వేతనాలతో పారిశుధ్య పనులు చేస్తున్న కాంట్రాక్టర్, వారికి సకాలంలో వేతనాలు చెల్లించక నెలలు తరబడి బకాయిలు పెట్టడం సరికాదన్నారు. దీంతో వేతనాలు అందక పారిశుధ్య కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలుతోపాటు బకాయి పడ్డ నాలుగు నెలల జీతాన్ని చెల్లించాలని, లేకుంటే విధులను బహిష్కరించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రమ్య, ఏరియా ఆసుపత్రి నాయకులు బాలన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ

ఆశ్రమాలు, కాలేజీల్లో సీట్లు పెంచాలి
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ

ప్రజాశక్తి-పెదబయలు : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కాలేజీల్లో ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా అవసరమైనన్ని సీట్లును పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జీవన్‌కృష్ణ అన్నారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రాథమిక విద్య నుండి ఉన్నతవిద్య వరకు చదువుకోవాలని ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులకు సీట్లు లేకుండా చేయడం, వీటిపై ప్రభుత్వం ఆంక్షలు ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యాలయాల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలు, కాలేజీలు చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితులు కల్పించడం దారుణమన్నారు. చదువుకుంటామని గిరిజన విద్యార్థులు వస్తుంటే, సీట్లు లేవంటూ ఆశ్రమాల హెచ్ఎంలు, ప్రిన్సిపల్స్‌తోపాటు సంబంధితశాఖ అధికారులు చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. స్వతదిద్యను ప్రోత్సాహిస్తున్న అధికారులు, ప్రభుత్వానికి, విద్యాలయాల్లో ప్రవేశానికి సీట్లు లేకుండా ఎలా సాధ్యమో చెప్పాలని ప్రశ్నించారు. గిరిజనులు మంచి నాణ్యమైన ప్రమాణాలతో ఉన్నతవిద్య చదవాలంటే, వారికి వసతి గృహాల్లో ప్రవేశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పెదబయలు మండలంలో సమయానికి మెనూ అమలు బాగోలేకపోవడంతో అక్కడి విద్యార్థులు టిసిలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

ప్రజాసేవలో రెవెన్యూశాఖ కీలకం

ప్రజాశక్తి-పాడేరు: రెవెన్యూశాఖపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఉందని, అటువంటి శాఖలో పనిచేయడం అదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత అన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన వేడుకలలో కలెక్టర్ మాట్లాడుతూ, 'సొంత లాభం కొంత మానుకొని పొరుగు వాడికి సాయపడవోయ్' అన్న గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకొని రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. విపత్తుల సమయంలో నిరాహారులు మాని రేయింబవళ్లు పనిచేస్తున్నారని, ఐదేళ్ల సార్వత్రిక ఎన్నికలలో రెవెన్యూ శాఖ పని తీరు అమోఘమని, దాని వల్లే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగిపోయిందన్నారు. ఎన్నికల విధుల నుంచి మినహాయింపును అనేక శాఖల అధికారులు, సిబ్బందికోరారని, కానీ ఒక్క రెవెన్యూ శాఖ నుండి అటువంటి అభ్యర్థన ఒక్కటీ రాలేదన్నారు. స్థానిక తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి అనారోగ్యంతోనూ నిజాయితీగా విధులు నిర్వర్తించడం ఇందుకు నిదర్శనమన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో 517 రకాల సేవలు ప్రజలకు అందుతున్నాయని, ఎటువంటి పనినైనా చేసేందుకు సన్నద్ధం ఉండడం ఒక్క రెవెన్యూకు సాధ్యమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి. పద్మావతి మాట్లాడుతూ, పుట్టుక నుంచి చనిపోయేవరకు, ఆ తర్వాత కూడా వివిధ అంశాల్లో రెవెన్యూ శాఖ సేవలు అందిస్తూనే ఉంటుందని, అంతటి గొప్ప శాఖ మరొకటి లేదని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రెవెన్యూ శాఖ అత్యంత కీలకమన్నారు. రెవెన్యూడేను పురస్కరించుకుని ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఎస్‌డిసి టి. అప్పారావు, డిపిఎంజి. ఈశ్వర్,ఆర్ ఐ జి.శ్రీహరిరావులకు ఘనంగా సత్కరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ఎస్‌డిసిలు వివిఎస్ శర్మ, భవాని, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, కలెక్టరేట్ తహసీల్దార్ అరుణకుమారి, రైతు సురేష్ మాట్లాడారు.కార్యక్రమంలో తహసీల్దార్ అప్పారావు, ఎఓ ఎం.సావిత్రి, కలెక్టరేట్ లోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

పెదబయలు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్మోహనరావు మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ ఎంతో కీలకమైందన్నారు. ప్రజలకు సేవ చేయడంలో రెవెన్యూ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పూర్వ ఎంపిడిఓ ఎల్.పూర్ణయ్య, ఎంఇఓ కొమ్ము కృష్ణమూర్తి, డిటి రంగారావు, వైస్ ఎంపిపి కొర్ర రాజుబాబు, ఆర్ఐ సింహాచలం, ఉపసర్పంచ్ బోండా గంగాధరం పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకపోతే చర్యలు తప్పవు
గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

గన్నెల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డిడి కొండలరావు

ప్రజాశక్తి- అరకులోయ : గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు హెచ్చరించారు. గురువారం అరకులోయ మండలంలో పర్యటించిన ఆయన లోతేరు, గన్నెల గిరిజన సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. పాఠశాల ప్రారంభమై వారం రోజులు కావడంతో విద్యార్థుల హాజరుసంఖ్యను పరిశీలించారు. అనంతరం గొందివలస, బట్టి వలస, దొర వలస పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.విద్యాబోధన, మెనూ అమలు వంటి అంశాల అమలు తీరుతెన్నులపై విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరకులోయలో విలేకర్లతో మాట్లాడుతూ, విద్యార్థులందరినీ పాఠశాలలకు రప్పించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో 90 శాతం మంది విద్యార్థులను పాఠశాలలు, కాలేజీలకు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 120 చొప్పున సీట్లు పెంచాలని, ఆరో తరగతిలో చేరేందుకు 60 సీట్లు చొప్పున సీట్లు పెంచాలని విద్యాశాఖ కమిషనర్‌కు కోరినట్లు విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు చేయకపోతే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా, పోషకాహార లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు పౌష్టిక విలువలున్న ఆహారం అందాలంటే, మెనూ ప్రకారం భోజనం తప్పనిసరి అన్నారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అరకులోయ ఎటిడబ్ల్యుఒ మల్లికార్జునరావు, హెచ్‌డబ్ల్యుఒలు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో టిడ్కో గృహాలను అందిస్తాం : గంటా

ప్రజాశక్తి -పిఎం పాలెం : టిడ్కో గృహాలను ఆరు నెలల కాలంలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. జివిఎంసి ఆరో వార్డు పరిధి బక్కన్నపాలెం సమీపంలో నిర్మాణ దశలో ఉన్న ఏపీ టిడ్కో గృహాలను గురువారం ఆయన సందర్శించారు. భీమిలి ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటి సారిగా వార్డులో అడుగుపెడుతున్న ఆయనకు తెలుగు యువత ఉపాధ్యక్షులు, కెవిఆర్ క్యాటరింగ్ అధినేత గరె గురునాథ్ ఆధ్వర్యాన క్రికెట్ స్టేడియం నుంచి బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. టిడ్కో గృహాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2014-19లో ఏపీలో లక్ష టిడ్కో గృహాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో 3360 ఇళ్లునిర్మించినట్లు చెప్పారు. 2019లో ప్రభుత్వం మారడం, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ ఇళ్లను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు.

నేరాలు ఘోరాలు

హోటల్ నెబో స్యూట్స్‌పై పోలీసుల దాడి
- వ్యభిచారం చేస్తూ పట్టుబడిన యువతీయువకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : హోటల్ నెబో స్యూట్స్‌పై పోలీసులు దాడి చేశారు. హోటల్ గదిలో వ్యభిచారం చేస్తున్న యువతీ యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ కథనం ప్రకారం... పెదగదిలి కూడలి సమీపంలోని హోటల్ నెబో స్యూట్స్‌లోని ఒక గదిలో యువతీయువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు సమాచారం రావడంతో రాత్రి దాడి చేసినట్టు తెలిపారు. అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్టు గుర్తించిన పోలీసులు యవతీయువకులను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో నివాసాల మధ్యనే హోటల్స్ ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకే వీటినిఎక్కువగా వినియోగిస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఆదర్శనగర్‌లోని ఒక హోటల్‌లో విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తుండగా పట్టుబడిన సంగతి తెలిసిందే. నివాసాల మధ్యనే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

బస్సులు, ఆటోలపై కేసులు

ప్రజాశక్తి -ఆనందపురం: నిబంధనలను ఉల్లంఘించిన 2 స్కూలు బస్సులు, 2 స్కూలు ఆటోలపై కేసులు, ఒక ఆటో సీజ్ చేసినట్లు ఆర్‌టిఎ అధికారులు తెలిపారు. గురువారం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి బోయపాలెం, సింహాచలం, కొమ్మాది తదితర ప్రాంతాలలో స్కూలు, కాలేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ నుంచి గురువారం వరకు 27 కేసుల నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వాహన తనిఖీ అధికార్లు కె.ప్రవీణ్‌కుమార్, ఎఎస్.గణేష్‌రెడ్డి, మన్మోహన్, మాధవి, రాజారావు, సుమన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వారపుసంత ఆశీలు వసూలుకు వేలం ఖరారు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :మండల కేంద్రంలో శనివారం నిర్వహించే వారపు సంతలో ఆశీలు వసూలుకు గురువారం స్థానిక ఎంపిడిఒ కిరణ్ కుమార్, ఇఒపిఆర్‌డి చిన్నాన్న, స్థానిక సెక్రటరీ గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. 11 మంది వేలం పాటలో పాల్గొనగా, పోటాపోటీగా సాగిన వేలంలో అత్యధిక మొత్తం రూ.2.053లక్షలకు కించాయిపుట్టు గ్రామ నివాసి రొబ్బ గణపతి కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కిరణ్‌కుమార్ మాట్లడుతూ, వారపు సంతలో దుకాణదారుల నుంచి నిర్దేశించిన విధంగా ఆశీలు వసూలుతోపాటు, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనుల చేపట్టాలని, ఎటువంటి ఆరోపణలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలని సూచించారు. జూలై మొదటివారం నుంచి ఆశీలు వసూలు చేసుకోవచ్చని సూచించారు.

బాలల హక్కులు-చట్టాలపై నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బాలాజీ బాబు జాతర బృందం ఆధ్వర్యాన బాలల హక్కులు- చట్టాలపై గురువారం నాటిక ప్రదర్శించారు. బాల్యవివాహాల వల్ల నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మీదేవి మాట్లాడుతూ, బాలింతలు, గర్భిణులు తీసుకొచ్చిన పౌష్టికాహారం, ఐసిడిఎస్ సరఫరా చేస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డి.సోమలక్ష్మి, ఎంఎస్‌కె.శిరీష, ఎడబ్ల్యుడబ్ల్యు టీచర్ మారుతి పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి ఆరో వార్డులో భూములు కోల్పోయిన రైతులకు ఇస్తామన్న ఇళ్లను వెంటనే ఇచ్చి న్యాయం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ మధురవాడ జోన్ నాయకులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలం పరిధి జివిఎంసి ఆరో వార్డు కొమ్మాది, రేవళ్లపాలెం, బక్కన్నపాలెం గ్రామాల్లో పేద దళిత, వెనుకబడిన తరగతులకు చెందిన రైతులకు 1976లో సర్వే నెంబర్లు 96 నుంచి 101 వరకుగల సుమారు 86 ఎకరాలను ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి ఎకరా చొప్పున ఇచ్చిందన్నారు. ఆ రోజుల్లో రైతులు అప్పులు చేసి భూములను సాగు చేసుకున్నారన్నారు. సొంతంగా నూతులు, బావులు తవ్వుకున్నారని, ఆవులు, గేదెలతో పాటు కోళ్లఫారాలు నడుపుతూ ఉపాధి పొందారన్నారు. ఆ భూములను వారికి చెప్పకుండా, ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా లాక్కుని జవహర్ నెహ్రూ నవోదయ, పోలీసుల శిక్షణా కేంద్రం, సెరీకల్చర్ కార్యాలయం, వికలాంగుల ఐటిఐ నిర్మించారన్నారు. ఒక్కొక్కటిగా ఈ సంస్థలు నిర్మిస్తున్న క్రమంలో తమకు నష్టపరిహారంగా నివాస గృహాల కోసం ఇంటి స్థలాలు ఇప్పించాలని అనేకసార్లు అధికారులు, కార్యాలయాల చుట్టూ బాధితులు తిరిగారని తెలిపారు. 2016లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌టిఆర్ హుదూద్ ఇళ్లను ఆ భూముల్లోనే నిర్మించారన్నారు. అప్పుడు గుడెసెలు వేసుకుని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక రూపాల్లో బాధితులు కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆ క్రమంలో జిల్లా కలెక్టరు, ఎపి హౌసింగ్ పీడీ, తహశీల్దారు.. ఇలా అందరూ రైతుల కుటుంబాలకు నిర్మాణం చేస్తున్న ఎన్‌టిఆర్ హుదూద్ ఇళ్లను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకూ న్యాయం జరగలేదన్నారు. తాజాగా ఆ భూముల్లో నిర్మించిన హుదూద్ ఇళ్ల వద్దకు కొందరు వచ్చి వారిని ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్.పైడితల్లి, సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు పాల్గొన్నారు.

సినీ తారల సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హీరోయిన్లు హనీ రోజ్, మానస చౌదరి గురువారం విశాఖలో సందడి చేశారు. బ్యూటీ సేవల్లో పేరుగాంచిన జై స్టూడియో నాలుగో బ్రాంచిని గురువారం ఉదయం సిరిపురంలోని విఐపి రోడ్డులో వీరిరువురూ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనీ రోజ్ మాట్లాడుతూ ప్రఖ్యాతిగాంచిన జై స్టూడియోను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంతో అధునాతనంగా.. అడ్వాన్స్ టెక్నాలజీతో కాస్మటాలజీ సేవలు ఇస్తున్నారని, కొత్త బ్రాంచి ప్రారంభ సందర్భంగా ఎన్నో ఆఫర్లు ప్రకటించారని తెలిపారు. తాను నటించిన సినిమా మలయాళం, తెలుగులో త్వరలో విడుదల కాబోతోందని, తెలుగులో కూడా చాలా అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. జై స్టూడియో మేనేజింగ్ పార్టనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తాము ఇప్పటివరకు మూడు బ్రాంచ్‌లను ఏర్పాటు చేశామని, ఇది నాలుగో బ్రాంచి అని తెలిపారు. దీనిలో కాస్మటాలజీ, బ్రైడల్ మేకప్, హెయిర్, ఆయుర్వేద సేవలు ఇస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జై స్టూడియో అధినేత జ్యోతి, రవి పాల్గొన్నారు.

ఎయు విసిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి పివిజిడి.ప్రసాద్ రెడ్డిపై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో దీక్ష ప్రారంభమైంది. ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు దీనికి మద్దతు తెలిపారు.

నగరం మండుతోంది..
సముద్రం పొంగుతోంది
భూ తాపం పెరగడంపై పర్యావరణవేత్తల్లో ఆందోళన

విశాఖ నగరంలో ఎండలోనే సాగుతున్న ప్రయాణాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గడచిన కొద్ది రోజులుగా విశాఖ నగరం మండుతోంది. తీరంలో సముద్ర కెరటాలు ఉప్పొంగుతున్నాయి. ఒడ్డునగల ఇసుక తిన్నెలన్నీ కెరటాలతో కొట్టుకుపోతున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే తీరం నిత్యం కోతకు గురౌతోంది. కోతకు గురికాకుండా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వైజాగ్ పోర్టు సహకారంతో తీరంలోని ఇసుకను సముద్రం మధ్యకు తీసుకెళ్లేందుకు బీచ్ నౌరిష్‌మెంట్ చేపడుతున్నా ఫలితం తాత్కాలికంగానే ఉంటోంది. ఓ వైపు మండుతున్న ఎండలు.. మరోవైపు సముద్రపు కెరటాలతో తీరం కోత.. వెరసి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

విశాఖకు చెందిన పర్యావరణ వేత్తలు ఈ పరిస్థితిపై తాజాగా స్పందిస్తూ 'ఎండాకాలం విస్తరించిన పరిస్థితులు నెలకొన్నాయి.. అందుకే ఈ వేడి' అంటూ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వర్షాకాలమైనా ఇదే స్థితి ఉంటుందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం నగరంలోనైతే స్వచ్ఛమైన గాలి పీల్చుకోడానికి సైతం జనం ఆత్రంగా ఎదురు చూసే పరిస్థితులు దాపురించాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్యంగా విజయనగరంలో 38 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు వెళ్లిపోగా విశాఖ నగరంలో 35 నుంచి 36 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. దేశంలోని ఢిల్లీ నగరంలో జనం అతలాకుతలం అవుతున్న సంగతి తెలిసిందే. సుమారు 50 డిగ్రీలకు అక్కడ ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం విలవిలలాడిపోతున్నారు. మానవ సమాజ మనుగడే కాకుండా యావత్ జీవరాసుల ఉనికికే 2100 నాటికి ప్రమాదం వాటిల్లనుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

భూ తాపంతో ఉప్పొంగుతున్న సముద్రం

భూ తాపం పెరగడంతో ధ్రువ ప్రాంతాల్లో మంచు కరుగుతోంది. దీంతో సముద్రాల ఉపరితలం ఏటా సెంటీమీటరు మేర పెరగడంతో నీరు ఉప్పొంగుతోంది. సముద్ర మట్టాలు వేగంగా పెరిగిపోతున్నాయి. 2100 నాటికి ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ఇప్పుడున్న 25 సెంటీమీటర్ల నుంచి 60 సెంటీమీటర్ల మేర సముద్ర మట్టాలు పైకి ఎగబాకే అవకాశాలున్నాయి. వాతావరణం ఇలా మారినందునే సీజన్స్ త్వరగా మారడం లేదని, ఎండాకాలం విస్తరణ కూడా ప్రస్తుతం కనిపిస్తోందని సర్వత్రా వెల్లడవుతోంది. ఏటా సెంటీమీటరు చొప్పున సముద్ర మట్టం పెరగడం అంటే మరో 70 ఏళ్లలో విశాఖను ఊహించగలమా ? అన్న ఆందోళనను పలువురు వ్యక్తపరుస్తున్నారు.

పిపిఎం పెరిగితే ఊహించని అనర్థాలు

ఒక మిలియన్ గాలి భాగాలలో కార్బన్ డయాక్సైడ్ భాగాలు ఎన్ని ఉన్నాయో పార్ట్స్ పర్ మిలియన్ (పిపిఎం) చెబుతుంది. భూ తాపం పెరగడం వల్ల వచ్చే సీజన్స్ మారడం లేదు. వర్షాల్లేకుండానే ఉరుములు, మెరుపులు వంటివి సంభవించడం, ఒకే ఏరియాలో వేర్వేరు వాతావరణం నెలకొనడం, సీ లెవెల్స్ పెరిగిపోతుండడం వంటివి గ్లోబల్ వార్మింగ్‌కు తార్కాణాలు. అత్యధిక జనాభా, ఎసిల వాడకం వల్ల వేడి నానాటికీ పెరిగిపోతోంది. కార్బన్ డయాక్సైడ్ స్థాయి ప్రస్తుతం 465 పిపిఎం ఉంది. 2100 నాటికి 600 పిపిఎం దాటిపోతే ఈ భూమి మీద జీవరాసులు జీవించలేవు. ఉన్న ఫలంగా ఆరు బిలియన్ మొక్కలు అంతటా పెంచితే తప్ప ఈ పరిస్థితి నుంచి మార్పును ఆశించలేం.

ప్రొఫెసర్ భైరాగిరెడ్డి, ఎయు విశ్రాంత అధ్యాపకులు, పర్యావరణవేత్త


కోతకు గురైన సముద్రతీరం

రామోజీ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు పత్రికా రంగంలో విలువలతో ఈనాడు పత్రికను నడిపిన చెరుకూరి రామోజీరావు విలువలు, పట్టుదలకు నిలువుటద్దంగా నిలిచారని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాలులో కీర్తిశేషులు రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. రామోజీ గ్రూపు సంస్థల పూర్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోపాల్గొన్న శ్రీభరత్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రామోజీ పత్రికాపరంగా ఎంతో కృషి చేశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకుల విధానాలను ప్రశ్నించి మార్పును తీసుకొచ్చారన్నారు. తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ముందుచూపు, పట్టుదలతో తాను అనుకున్న లక్ష్యాలను సాధించిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అన్నారు.

కార్యక్రమంలో ఈనాడు పూర్వ ఎడిషన్ ఇన్‌ఛార్జి సర్వేశ్వరరావు, రామోజీ గ్రూపు సంస్థల మాజీ ఉద్యోగస్తులు దాసరి శివ కుమార్ రెడ్డి, జి.సత్యనారాయణ, జి.ములకోటి, సుబ్బయ్య, అర్.శ్రీనివాసరావు, ఎవి.సత్యనారాయణ, పేడాడ రమేష్, సత్య ప్రసాద్, అరుణ్ కుమార్, రాజేష్ పాడి, అర్‌వి.రమణ పాల్గొన్నారు.

పిఒతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

గిరిజన అభ్యర్థులకు డిఎస్‌సి ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

నియోజకవర్గ పరిధిలోని 11 మండలాల్లో బీఈడీ, డిఈడి చదివిన గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీకి ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదివాసీ ఉద్యోగుల సంఘం, ఆదివాసీ సంక్షేమ సాంస్కృతిక సంఘం నాయకులు గురువారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిసిన విజ్ఞప్తి చేశారు. దీనిపై ఐటీడీఏ పీవో సానుకూలంగా స్పందించినట్లు ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కంగల శ్రీనివాస్ తెలిపారు. త్వరలో బిఈడి, డిఈడి అభ్యర్థులకు పరీక్ష పెట్టి అందులో 50 మందిని ఎంపిక చేసి వారికి వైటీసీలో కోచింగ్ ఏర్పాటు చేస్తామని, ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఉచిత భోజనం సదుపాయం కల్పించి, కోచింగ్ ఇప్పిస్తామని పిఒ చెప్పినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ సాంస్కృతిక సంఘం జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర, ప్రచార కార్యదర్శి అశోక్ కృష్ణ, కార్యదర్శులు కంగాల అబ్బాయి, బంధం పోతున్న దొర, నడిపూడి సంజీవరెడ్డి, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి

ప్రజాశక్తి-రంపచోడవరం : రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని టిడిపి నాయకులు కోండ్రు చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లపాటు నియంత పాలన సాగిందని పేర్కొన్నారు. నేడు చంద్రబాబు నాయుడు తన మార్కు పాలనతో రాష్ట్రాన్ని అభివద్ధి బాటలో పరుగులు పెట్టించడం ఖాయమన్నారు. ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రిగా పవన్ కళ్యాణ్‌కి బాధ్యతలు అప్పగించడం హర్షణీయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల నుండి తీసుకున్న నిధులతో పాటు మరిన్ని నిధులు సమకూర్చి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. పంచాయతీల్లో జరిగే అవినీతిపై కూడా దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

టిడిపి పట్టణ అధ్యక్షునికి సతీ వియోగం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సన్యాసిరావు భార్య, టిడిపి కార్యకర్త కొప్పుశెట్టి వరలక్ష్మి బుధవారం రాత్రి విశాఖపట్నం కేర్ హాస్పిటల్ చికిత్స పొందుతూ మృతి చెందారు. గుండె, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వరలక్ష్మిని మెరుగైన వైద్యం నిమిత్తం వారం రోజుల క్రితం విశాఖ కేర్ హాస్పిటల్ తరలించారు. ప్రముఖ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ఆమె కోల్కొనే పరిస్థితి కనిపించలేదు. వ్యాధి తీవ్రతరం కావడంతో బైపాస్ సర్జరీ చేయాలని ఆమె భర్త సన్యాసిరావుకి వైద్యులు సూచించగా, అందుకు ఆయన అంగీకరించారు. దీంతో వైద్యులు గుండెకు బైపాస్ సర్జరీ చేశారు. ఈ క్రమంలో ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతి చెందారు. వరలక్ష్మి ఆమె మృతదేహాన్ని సీలేరు తరలించి గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. వరలక్ష్మి మృతికి టిడిపి నాయకులు ఎన్ తిరుమలరావు, చిటికెల రాము, మాజీ ఎంపీటీసీ పాంగి లుసి తదితరులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

పలుచోట్ల ఈస్ట్ కోస్ట్ రైల్వే జిఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ విజయనగరం-రాయగడ, రాయగడ-కోరాపుట్ సెక్షన్‌లలో గురువారం ఉదయం మౌలిక సదుపాయాల అభివృద్ధి, కార్యాచరణ సామర్థ్యంపై దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. రాయగడ ప్రాంతంలో ట్రాఫిక్ పనుల పురోగతిని అంచనా వేశారు. రైల్వే కార్యకలాపాలపై సమీక్ష జరిపారు.